క్లుప్తంగా

సీఎం వెంట ఎమ్మెల్యే టీఆర్ఆర్



సీఎంతో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, ఉద్యోగ ఉపాధి కల్పన పెట్టుబడుల కోసం సీఎం రేవంత్‌రెడ్డి వెంట అమెరికా పర్యటనకు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి వెళ్లారు. అమెరికాలోని భారతీయులను కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పది రోజుల విదేశీ పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే సీఎంతో పాటు కలిసి పాల్గొనున్నట్లు తెలిసింది. ప్రభుత్వ, ప్రైవేటు వ్యాపార ప్రముఖులతో సమావేశాలు, చర్చలు జరపనున్నారు

ముర్రుపాలు పిల్లలకు రక్ష
అంగన్‌వాడీ టీచర్ గోంగమ్మ



తల్లిపాల విశిష్టతను తెలుపుతున్న గోంగమ్మ

మోమిన్‌పేట: ముర్రుపాలు పిల్లలకు శ్రీరామ రక్ష అని అంగన్‌వాడీ టీచర్ గోంగమ్మ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కోల్కుందలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డకు తల్లిపాలు పట్టించాలన్నారు. ముర్రుపాలలో రోగ నిరోధకశక్తి పుష్కలంగా ఉంటుందన్నారు. తల్లిపాలు పట్టించడం వల్ల తల్లి పిల్లల అప్యాయత ముడిపడి ఉందని, తల్లి ఓడిలోనే బిడ్డ సేద తీరాలని చెప్పారు. కావునా, ప్రతితల్లి తన బిడ్డకు పాలు పట్టించాలని సూచించారు.

యువజన నాయకుడికి సన్మానం



సన్మానం చేస్తున్న నాయకులు

కొడంగల్ : యువజన కాంగ్రెస్ జాతీయ సమన్వయకర్తగా నియమితులైన పట్టణానికి చెందిన కృష్ణంరాజును యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానం చేశారు. జాతీయస్థాయిలో పదవి పొందినందుకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు సతీష్‌రెడ్డి, శ్రీనివాస్, అశోక్, అమర్నాథ్, మహిపాల్, నరేష్, శ్రీనివాస్, మోహన్ పాల్గొన్నారు.

ఊరంతా కలిసి వీడ్కోలు



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

తాండూరు రూరల్: తమ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు బదిలీపై వెళ్తుండటంతో ఊరంతా కలిసి వీడ్కోలు పలికారు. తాండూరు మండలం చెనిగేస్‌పూర్ ప్రాథమిక పాఠశాల్లో హెచ్‌ఎం ప్రభాకర్‌చారి, ఉపాధ్యాయురాలు లావణ్యలు బదిలీపై వెళ్లారు. ఆదివారం పాఠశాల ఆవరణలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు, కొత్త ఉపాధ్యాయులకు శాలువ ,పూల మాలలతో సన్మానించారు. గ్రామస్తులు ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. కొనాపూర్ పాఠశాల్లో పని చేసిన నీతాతో పాటు పంచాయతీ కార్యదర్శి విశ్వనాథం బదిలీ కావడంతో వారిని కూడా సత్కారించారు. అంగన్‌వాడీ టీచర్లు నరేంద్రమ్మ, సావిత్రమ్మ, నాయకులు శ్రీశైలంగౌడ్ ,రాజుగౌడ్, వెంకటేష్, శేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రమేష్‌లు ఉన్నారు.

బీసీల అభ్యున్నతికి కృషి
మాజీ సర్పంచ్ కృష్ణ



ఆత్మీయ సమ్మేళనంలో సంఘం నేతలు

దోమ : బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీ సర్పంచ్ కృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని దొంగఎన్కేపల్లి గ్రామంలో బీసీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, ఐకమత్యంతో బీసీల హక్కుల కోసం పోరాటం చేయాలని సూచించారు.

పత్తాలేని వ్యవసాయ అధికారులు

ఎప్పటికప్పుడు రైతులకు అండగా నిలిచి సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన వ్యవసాయశాఖ అధికారులు పత్తా లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎరువుల దుకాణాల యజమానులు చెప్పిందే వేదంగా పురుగుల మందులు తెచ్చి పంటలకు పిచికారీ చేస్తూ నష్టాలను చవిచూస్తున్నారు.

- తెల్ల బంగారానికి తెగుళ్ల బెడద
- పూత సమయంలో రోగాలు
- దిగాలు చెందుతున్న అన్నదాతలు



పత్తి పంటలకు మందు పిచికారీ చేస్తున్న రైతు

పెద్దేముల్: తెల్లబంగారానికి తెగుళ్ల బెడద పొంచి ఉంది. ఇటీవల కురిసిన భారీవర్షాలకు కొంత మేర పంటలు దెబ్బతిన్నాయి. పంటలు వివిధ రకాల తెగుళ్లతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం సలహాలు, సూచనలు ఇచ్చేవారు లేక ఎరువుల దుకాణాల యజమానులు చెప్పిందే వేదంగా మందులు తెచ్చి పంటలకు పిచికారీ చేసి నష్టపోతున్నామని ఆయా గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వర్షాలు లేక ఇబ్బందులు

విత్తే సమయంలో వరుణదేవుడు కరుణించక పోవడం.. తరువాత ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో రోగాలు అంతుచిక్కడం లేదని రైతులు లబోదిబోమంటున్నారు. కొంతమంది రైతులు ప్రారంభంలో బోరుబావుల వద్ద స్పింకర్లు పెట్టి పంటలను కాపాడుకుంటున్నారు. ప్రతి ఏటా ఏదో విధంగా పంటలు నాశనం కావడం తప్పడం లేదని నాగులపల్లి, ఇందూరు, అడ్కిచెర్ల, తట్టెపల్లి, పెద్దేముల్‌తో పాటు పలు గ్రామాల రైతులు వాపోతున్నారు. గత వారం రోజుల క్రితం వరుసగా కురిసిన వర్షాలు రైతుకు కునుకు లేకుండా చేశాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పెసర, మినుము పంటలు కూడా ఎర్ర బారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విత్తనాలు నాటే సమయంలో వర్షాలు కురవక, పంటలు ఎదిగే సమయంలో వర్షాలు కురవడం, పూతకాత సమయంలో వర్షాలు కురవకపోవడంతో పంటలపై రైతన్నలు ఆశలు వదులుకుంటున్నారు. పెద్దేముల్ మండలంలో పత్తి 12వేల ఎకరాలు, కంది 11వందల ఎకరాలు, మొక్కజొన్న 150 , మినుము-1,020 , పెసర- 570, తెల్లజొన్న-120 ఎకరాలలో సాగుచేసినట్లు అధికారులు తెలియచేశారు.

వ్యవసాయ అధికారులు ఎక్కడ?

మండలంలోని వ్యవసాయశాఖ అధికారులు ఎక్కడ ఉంటారో.. ఎప్పుడు వస్తారో తెలియని పరిస్థితి ఉందని ఆయా గ్రామాల రైతులు అంటున్నారు. వర్షాలకు పంటలు తెగుళ్ల బారిన పడి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నా, కనీసం వ్యవసాయ అధికారులు కన్నెత్తి చూడటం లేదని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. గతంలో మండలానికి ఒక్క ఏఈఓ ఉన్న సమయానికి అందుబాటుల్లో ఉండేవారిని, ప్రస్తుతం ఏఓతో పాటు సుమారు ఆరు గురు ఏఈఓలు ఉన్నా ఎలాంటి లాభం లేదని రైతులు అంటున్నారు. కనీసం పంటలకు సోకిన రోగాలకు ఏ మందులు పిచికారీ చేయాలనే సమాధానం ఇచ్చే వారు లేరని అన్నదాతలు చెబుతున్నారు. మండల కేంద్రంలో ఉన్న రైతువేదికలో అధికారులు లేక మూతబడి ఉంటుందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వ్యవసాయ అధికారులు అందుబాటుల్లో ఉండేలా చూడాలని కోరుతున్నారు.

రోడ్లను బాగు చేయండి



ప్రధాన రోడ్డుపై ఉన్న గుంతను పూడుస్తున్న మాధవరెడ్డి

అనంతగిరి: వికారాబాద్‌లో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను వెంటనే బాగు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో చేపడుతున్న మున్సిపల్ దర్బార్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని అనంతగిరిపల్లి మున్సిపల్ పరిధిలోని అనంతగిరిపల్లి, చెంచుపల్లి, లక్ష్మీనగర్ తండా, బలిజగూడెంలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం శ్రమదానం చేసి ప్రధాన రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ.. వార్డులో పలుచోట్ల సీసీరోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. అన్ని సమస్యలను తెలుసుకుని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరాజు, పట్టణ పార్టీ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, పట్టణ ఇన్‌చార్జి రాజేందర్‌రెడ్డి, ప్రముఖ డాక్టర్ రాజశేఖర్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు శిరీష, పట్టణ ప్రధాన కార్యదర్శి అమరనాథ్, మాజీ కౌన్సిలర్ సుచరితారెడ్డి పాల్గొన్నారు.

రక్తదానం ఆరోగ్యానికి మంచిది



శిబిరం ప్రారంభిస్తున్న అధికారులు

కొడంగల్ : రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యానికి మంచిదని వికారాబాద్ జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ రవీంద్రాయాదవ్, సీఐ శ్రీధర్‌రెడ్డి అన్నారు. ప్రపంచ స్నేహితుల దినోత్సవం సందర్భంగా యువసేన ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రక్తదానం శిబిరం నిర్వహించారు. ఉ.10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు 50 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రక్తదానం చేయడం వల్ల కొత్తరక్తం ఉత్పత్తి అవుతుందన్నారు. కొత్తరక్తం వల్ల శరీర భాగాలు చురుకుగా పని చేస్తాయన్నారు. శరీరంలో ఉన్న కొవ్వు తగ్గుతుందన్నారు. రక్తదానంతో జీవితకాలం పెరుగుతుందన్నారు. ఎంతోమంది బాధితులకు ప్రాణదానం చేసినట్లు అవుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సాకేత్, అప్తాల్మిక్ అధికారి లయన్ హరినాథ్ నెహ్రు, ల్యాబ్ టెక్నిషియన్ బస్వరాజ్, యువసేన ఫ్రెండ్స్ జగదీష్, నాగరాజు, నవీన్‌కుమార్, రాకేష్, రాజేష్, శివరాంరెడ్డి, పవన్‌కుమార్, రాధాకృష్ణ, బస్వరాజ్, చందు పాల్గొన్నారు.

జవాన్ యాదయ్యకు నివాళి



యాదయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాములు

మోమిన్‌పేట: 20 సంవత్సరాల క్రితం జమ్ముకశ్మీర్‌లో సీఆర్‌పీఎఫ్ జవాన్ యాదయ్య విధి నిర్వహణ ముష్కరుల బాంబు బ్లాస్టులో మృతి చెందాడు. ఈ సందర్భంగా ఆదివారం సీఆర్‌పీఎఫ్ చంద్రాయణగుట్ట, కింపేట క్యాంపు ఏఎస్‌ఐ రాములు నివాళులర్పించారు. మండల పరిధిలోని ఎన్కేపల్లిలో జవాన్ యాదయ్య 20వ సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఎస్‌ఐ అరవింద్, సీఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ రాజప్ప యాదయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశసేవలో అమరులైన వారిని ప్రజలు గుర్తించుకుంటారని అన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు అంజయ్య, నాయకులు మల్లయ్య, మైపాల్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, కుటుంబ సభ్యులు అనుసూయ, నర్సింలు, హరీశ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఘనంగా చౌడేశ్వరీమాత జయంతి



పూజలు చేస్తున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

దౌల్తాబాద్: మండలంలోని బాలంపేటలో ఆదివారం నందవరం చౌడేశ్వరీమాత జయంతి వేడుకలను ఘనంగా జరిపారు. అమ్మవారికి ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి,పల్లకీ సేవ చేశారు. గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రతి ఏటా ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరీమాత జయంతి

కొడంగల్ రూరల్ : పట్టణ శివారులోని వెలసిన నందవరం చౌడేశ్వరీమాత జయంతి ఉత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, పంచామృత అభిషేకం, అమ్మవారికి ప్రత్యేక పూజలతో విశేష అలంకరణ చేసిన అనంతరం దూపదీప నైవేద్యాలను సమరిస్తూ మంగళహారతులు అందజేశారు. ఈ సందర్భంగా పరిసర గ్రామాల ప్రజలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

అర్చకులు తరలిరావాలి
డీడీఎన్ఎస్ జిల్లా అధ్యక్షుడు జయతీర్థాచారి



కొడంగల్ రూరల్ : పట్టణంలోని కేఎస్‌వీ ఫంక్షన్ హాలులో 6న (మంగళవారం) నిర్వహించనున్న డీడీఎన్ఎస్(దూప దీప నైవేద్య అర్చక సంఘం) ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు లోకూర్తి జయతీర్థాచారి కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. డీడీఎన్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దౌల్తాబాద్ వాసుదేవశర్మ మొట్టమొదటిసారిగా జిల్లాకు విచ్చేయుచున్న నేపథ్యంలో అర్చకులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. అర్చకుల సమస్యలపై చర్చించుకుని, సాధనకు తీసుకోవాల్సిన ప్రణాళికను రూపొందించుకునేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. అర్చకులంతా సమైక్యత చాటుతూ అధిక సంఖ్యలో హాజరై సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

పార్టీ నాయకులు తరలిరావాలి

బంట్వారం: వికారాబాద్ పట్టణంలో నేడు (సోమవారం) స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమట్‌రెడ్డి వెంకట్‌రెడ్డి హాజరతారన్నారు. ఉ.10 గంటలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.

విరాళాల సేకరణ



నగదు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

దుద్యాల్: కేరళ వయనాడ్ జిల్లాలో వరదలు సృష్టించిన విపత్తుకు 400 మంది ప్రజలు దుర్మరణం చెందారు. బాధితులకు అండగా ఉండాలనే ఉద్దేశంతో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్రయ్య మండల కేంద్రంలో ఆదివారం విరాళాలు సేకరించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వయనాడ్ ప్రజలకు అందరం అండగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు మల్లయ్య, వెంకటయ్య రాములు, మొగులప్ప, శివకుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

మోమిన్‌పేట: మండల పరిధిలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నుంచి శ్రావణమాస ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి మల్లేశం స్వామి తెలిపారు. ఉదయం అభిషేకాలు, హారతి, దర్శనం, తీర్థ ప్రసాదాలు ఉంటాయన్నారు. సోమవారం ప్రత్యేక పూజల దృష్ట్యా స్వామిని ప్రత్యేకంగా అలంకరించామన్నారు. నెల రోజుల పాటు ప్రత్యేక పూజల అనంతరం ఆఖరి సోమవారం జాతర మహోత్సవం నిర్వహిస్తామని చెప్పారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

డీఎస్పీ బాలకృష్ణారెడ్డి



అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు టౌన్ : సైబర్ నేరాలపై ప్రజలు, వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. కష్టపడ కుండా డబ్బులు ఎవరూ సంపాదించలేరని, ఇంట్లో కూర్చొనే ఎక్కువ మొత్తంలో సంపాదించవచ్చని సైబర్ నేరగాళ్లు వల వేస్తున్నారని అన్నారు. ఫేక్‌కాల్స్ చేయడం, ఫేక్ ఈ మెయిల్స్ పంపడం, ఉద్యోగాల పేరిట టోకరా, వడ్డీ లేకుండా రుణాలు ఇస్తామని, క్రెడిట్ కార్డుల పేరిట దందా, పేటీఎం, ఇతర యూపీఐలు, బ్యాంకు ఖాతాల కేవైసీని పూర్తి చేయడం, ఓఎల్‌ఎక్స్ ద్వారా తక్కువ ధరకే వస్తువుల అమ్మకం, కస్టమర్ కేర్ పేరిట బురిడీ కొట్టించడం వంటి వాటితో సైబర్ నేరగాళ్లు నేరాలకు ఒడిగడుతున్నారన్నారు. ఇలాంటి విషయాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్‌కు సమాధానం ఇవ్వకుండా, సంబంధిత బ్యాంకులకు లేదా కార్యాలయాలకు వెళ్లి వాకబు చేయాలన్నారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న మాట్లాడుతూ.. నేటి ఆధునిక, సాంకేతిక యుగంలో అనేక రకాలుగా నేరగాళ్లు జనాలను మోసగిస్తున్నారన్నారు. ముఖ్యంగా సైబర్ నేరగాళ్ల వలలో చిక్కకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కొ్త్రిక విజయలక్ష్మి, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, వ్యాపారులు ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గుంత



మల్లప్పమడిగ సమీపంలో డ్రైన్‌పై ఏర్పడిన గుంత

తాండూరు టౌన్ : ప్రధాన రహదారి డ్రైన్‌పై ప్రమాదకరంగా ఏర్పడిన గుంత అధికారుల కళ్లకు కనిపించడం లేదు. పట్టణంలోని మల్లప్పమడిగ సమీపంలో నేషనల్ హైవే 167 (ఎన్) రోడ్డు నిర్మాణంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా పెద్ద డ్రైన్ నిర్మాణాన్ని చేపట్టారు. నిర్మించి నెలలు గడవక ముందే డ్రైన్‌పై గుంత ఏర్పడింది. నాణ్యత లేకుండా డ్రైన్ నిర్మించడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిలో నిత్యం వందలాది వాహనాలు తిరుగుతూ ఉంటాయి. పలుమార్లు వాహనదారులు ప్రమాదానికి గురయ్యారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బి అధికారులకు పలుసార్లు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన గుంతకు మరమ్మతులు చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

పంచాయతీ కార్యదర్శులకు సన్మానం



కార్యదర్శులను సన్మానిస్తున్న గ్రామస్తులు

దుద్యాల్ : మండలంలోని ఈర్లపల్లి, సంత్రకుంట తండాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు బదిలీపై వెళ్లడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆదివారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈర్లపల్లి పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ సంత్రకుంట తండా పంచాయతీ కార్యదర్శి నరేందర్ బొంరాస్‌పేట మండలంలోని కొత్తూరు పరిధిలోని ఎనిమిది తండాకు బదిలీయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధికి వీరు అందించిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీబాయి, ఉప సర్పంచ్ రెడ్యానాయక్, వార్డు సభ్యులు, గ్రామస్తులున్నారు.

'రియల్'పై మబ్బులు తొలగేనా?



మోమిన్‌పేటలో ఏర్పాటు చేసిన వెంచర్

- సంవత్సర కాలంగా డీలా
- అగ్రిమెంట్ల వద్దే ఆగిన కొనుగోళ్లు
- నూతన ప్రభుత్వంపై ఆశలు

మోమిన్‌పేట: ఏడాదిన్నర కాలంగా రియల్ వ్యాపారంపై మబ్బులు కమ్ముకున్నాయి. ఎంతో మంది వ్యాపారులు అప్పులు చేసి కొనుగోలు చేసిన భూములు ఎక్కడికక్కడే ఉన్నాయి. సేల్ అయిన చాలా భూములు అగ్రిమెంట్ల వద్ద నిలిచిపోయాయి. అంతకుముందు రోజుకు మోమిన్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో 40 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతుండేవి. ప్రస్తుతం రోజుకు 10 కూడా కావడం లేదు. అవి కూడా గుంటల్లో రిజిస్ట్రేషన్లు జరగడం గమనార్హం. నాలుగైదు సంవత్సరాల క్రితం ఎకరం రూ.లక్షల్లో పలుకగా గత ఏడాది నుంచి రూ.కోట్లకు చేరింది. నాలుగు సంవత్సరాలలోనే నాలుగైదు వందల రెట్లు పెరిగిపోయింది. దీనిని ఆసరాగా తీసుకొన్న కొంతమంది వ్యాపారులు అప్పులు చేసి సిండికెట్‌గా ఏర్పడి కొనుగోలు చేసిన భూముల ధరలు ఒక్కసారిగా పడి పోవడంతో ఏమీ చేయాలో అర్థం కాక కకావికలం అవుతున్నారు. జిల్లాలోనే మోమిన్‌పేట మండలంలో రియల్ వ్యాపారం అందనంత ఎత్తుకు వెళ్లింది. పెట్టిన పెట్టుబడికి మూడు నాలుగు వందల రెట్లు పెరిగి లాభాలు వచ్చాయి. ఏన్కతల గ్రామంలో 1100ఎకరాలలో మోబిలిటీ వ్యాలీ కంపెనీ ఏర్పడనుందని ప్రభుత్వం పేర్కొనడంతో భూముల ధరలు అమాంతం పెరిగిపోయాయి. గత ఏడాదిన్నర క్రితం రాష్ట్ర ప్రభుత్వం 111జీఓను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించడంతో మండలంలో అమాంతం రియల్ వ్యాపారం దెబ్బతింది. పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంతో పెట్టుబడి దారులు ఎక్కడ పెట్టుబడి పెట్టాలో అర్థం కాక మిన్నకుండి పోయారని సర్వత్రా వినిపిస్తున్న మాటలు. రియల్ పడిపోవడంతో వెంచర్‌లు ఏర్పాటు చేసిన చాలా గ్రామాల్లో కొనుగోళ్లు నిలిచిపోయాయి. మండల పరిధిలోని ఏ గ్రామంలోనైనా రోడ్డు పక్కన ఎకరా రూ.కోటిపైనే. మోమిన్‌పేట, శంకర్‌పల్లి రోడ్డుపై రూ.4కోట్లపైనే పలుకుతుంది. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకోనే చర్యలతోనే రియల్ వ్యాపారం ముడిపడి ఉందని పలువురు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకొన్నామని పలువురు రియల్ వ్యాపారులు చెబుతున్నారు. ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఆ దిశగా అడుగులు పడటం లేదని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తిరిగి రియల్ భూమ్ పెరిగితేనే బాగుంటుందని రైతులు సైతం పేర్కొంటున్నారు. ఎకరా రూ.కోట్లలో పలుకడంతో ఎంతో ధీమాగా జీవిస్తున్నామని రైతులు అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా పావులు కదపాలని పలువురు కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణతో మానవాళికి మేలు



మొక్కలు నాటుతున్న సేవా సమితి సభ్యులు

చేవెళ్ల: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సత్యసాయి సేవా సమితి మహిళా యూత్ కో-ఆర్డినేటర్ నాగజ్యోతి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం అఖిల భారత స్థాయిలో ఆగస్టు 4వ తేదీన చేపట్టిన 'ప్రేమ తరు-మొక్కలు నాటు' కార్యక్రమంలో భాగంగా శ్రీసత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సేవా సమితి సభ్యులందరూ కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా సత్యసాయి సేవా సమితి యువతతో పాటుగా భక్తులు ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో పాల్గొంటున్నార ని అన్నిచోట్ల విరివిగా మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నారన్నారు. పర్యావరణ పరిరక్షణకు అత్యధిక సంఖ్యలో మొక్కలు నాటి స్వామివారి ఆశీస్సులు పొందాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణతో మానవాళికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించి మొక్క లను పెంచాలని చెప్పారు. కార్యక్రమంలో సత్య సాయి సేవా సమితి చేవెళ్ల కన్వీనర్ రామగౌడ్, య్యూత్ కో-ఆర్డినేటర్ విజయ్‌కుమార్, సేవాదల్ కో-ఆర్డినేటర్ భాస్కర్, మహిళా యూత్ కో-ఆర్డినేటర్ నిర్మల, విజయకుమార్, సభ్యులు శశిరేఖ, స్వ రూప, మధుసూదన్, పెంటారెడ్డి, చేగూరి మానిక్యరెడ్డి, మహేందర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, ఆంజనేయులు ఉన్నారు.